

# సినిమా న్యూస్

## 'స్వయంభు' స్టోరీ లీక్ చేసిన నిఖిల్



హీరో నిఖిల్ అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'స్వయంభు' అనే ప్రతిష్టాత్మక చిత్రంతో రాబోతున్నారు. ప్రాచీన రాజుల కాలం నాటి కథాంశంతో రాబోతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ మూవీలో ఆయన ఒక పోరాడే వీర యోధుడి పాత్రలో కనిపించబోతున్నారు. దర్శకుడు భరత్ కృష్ణమాచారి తెరకెక్కిస్తున్న ఈ భారీ సినిమాలో సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అత్యంత వేగంగా జరుపుకుంటోంది. అన్ని నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని రాబోయే సెప్టెంబర్ నెలలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా, సినిమా ప్రమోషన్లలో భాగంగా హీరో నిఖిల్, హీరోయిన్లు నభా నటేష్, సంయుక్త మీనన్‌లతో కలిసి ప్రముఖ యాంకర్ సుమ నిర్వహించిన ఒక స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. హీరో నిఖిల్ మూవీకి సంబంధించిన ఒక బిగ్ అప్‌డేట్‌ను లీక్ చేశారు.

'స్వయంభు' సినిమా దాదాపు వెయ్యేళ్ల క్రితం నిజంగా జరిగిన ఒక సంఘటన ఆధారంగా రూపుదిద్దుకుందని చెప్పారు. క్రీస్తు శకం 985వ సంవత్సరంలో రాజుల కాలంలో తిరుపతి సమీపంలోని శ్రీగిరి అనే ప్రదేశంలో జరిగిన యథార్థ కథ ఆధారంగానే ఈ సినిమాను రూపొందించామని ఆయన వెల్లడించారు.

అంతేకాకుండా ఈ సినిమాలో అందరి ఫేవరెట్ 'శక్తిమాన్' హీరో ముఖేష్ ఖన్నా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారని తెలిపారు. ఆయన పాత్ర చాలా అద్భుతంగా వచ్చిందని, థియేటర్లలో సినిమా చూశాక ఆయన పాత్రను చూసి ప్రేక్షకులు ఖచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారని నిఖిల్ చెప్పారు. నిజానికి ముఖేష్ ఖన్నా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 1997 నుంచి 2005 మధ్య కాలంలో వచ్చిన 'శక్తిమాన్' సీరియల్‌తో ఆయన దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. తెలుగులో 'ధన 51', 'పురుషోత్తముడు' వంటి చిత్రాల్లో నటించారు. చాలా కాలం తర్వాత మళ్లీ 'స్వయంభు' చిత్రంతో టాలీవుడ్ తెరపై కనిపించబోతుండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.

## 'ది ప్యారడైజ్' టీజర్ డేట్ ఫిక్స్


నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ది ప్యారడైజ్'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ప్రేక్షకులు, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించబోతుండగా, నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అయితే, ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నప్పటికీ, అనుకున్న సమయానికి విడుదల కాలేకపోతోంది. రకరకాల కారణాల వల్ల ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ గతంలో ప్రకటించారు.




కానీ గత కొన్ని రోజులుగా 'ది ప్యారడైజ్' చిత్రం మరోసారి వాయిదా పడబోతోందంటూ సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో, తాజాగా మూవీ టీమ్ ఒక బిగ్ అప్‌డేట్ ఇవ్వడంతో పాటు విడుదల వాయిదాపై హింట్ ఇచ్చింది. ఈ సినిమా మోస్ట్ అవైటెడ్ టీజర్‌ను ఆగస్ట్ 6న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ ఒక కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో నాని ఒక వినూత్నమైన లుక్‌లో పక్షి రెక్కలపై నిలబడి కనిపించారు. ఈ పోస్టర్‌తో పాటు "అతని నీడ కూడా చిరునవ్వుల రెక్కలతో ఎగురుతుంది" అనే ఒక క్యాప్షన్‌ను జత చేశారు. అయితే, ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఈ టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ఎక్కడా కూడా సినిమా విడుదల తేదీ లేకపోవడం గమనార్హం. దీంతో నెటిజన్లు సినిమా వాయిదా పడటం ఖాయమని భావిస్తున్నారు. ముందస్తుగా ప్రకటించిన తేదీకి విడుదల కాకపోవడంపై నాని అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తూ, అసలు సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందోనని నెట్టింట పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

## 'బ్లడీరోమియో'కి ముహూర్తం ఫిక్స్


న్యాచురల్ స్టార్ నాని, యంగ్ అండ్ డైనామిక్ డైరెక్టర్ సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లడీ రోమియో'. నిహారిక ఎంటెర్టైమెంట్స్ తో నాని సొంత నిర్మాణ సంస్థ యునానిమస్ ప్రొడక్షన్స్ పై నాని, వెంకట్ బోయినపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్టైలిష్ విజువల్స్, నాని సరికొత్త మేకోవర్‌తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన క్రేజీ అప్‌డేట్ తాజాగా బయటకు వచ్చింది.




వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'బ్లడీ రోమియో' చిత్ర షూటింగ్ ఈ ఏడాది అక్టోబర్ నెలలో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. మొదటి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆ తర్వాత లండన్ వేదికగా ఒక భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నారు. లండన్‌లో తీయబోయే సన్నివేశాలు ఈ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ఈ చిత్రంలో మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. సుజీత్ మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్, ప్రొడక్షన్ వాల్యూస్ కలిపి ఈ చిత్రాన్ని 2027 సమ్మర్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అలాగే ఈ సినిమా కోసం ముగ్గురు సంగీత దర్శకులు పని చేయబోతున్నట్టు కూడా టాక్ వినిపిస్తోంది. నాని-సుజీత్ కలయికలో వస్తున్న ఈ యాక్షన్ డ్రామాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## డీప్ ఫేక్‌కు గురైన మృణాల్

సాంకేతిక ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవ జీవితాన్ని వేగంగా మార్చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. వైద్యం, విద్య, సమాచార రంగాలు, సినిమా పరిశ్రమ వరకు అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా సినిమా సెలబ్రిటీల ఫోటోలు, వీడియోలను మార్చి డీప్‌ఫేక్స్ క్రియేట్ చేయడం ఎక్కువైపోయింది. తమ పేరును, రూపాన్ని కాపాడుకోవడానికి ఇప్పటికే చాలామంది హీరోహీరోయిన్లు కోర్టులకు వెళ్లారు. ఇప్పుడు అదే బాటలో యంగ్ బ్యూటీ మృణాళ్ ఠాకూర్ కూడా తన డీప్‌ఫేక్స్ తయారు చేస్తున్న వారిపై తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి అనుమతి తీసుకోకుండా ఇతరుల రూపాన్ని ఏఐ ద్వారా వాడటం చట్టరీత్యా నేరమని, ఇలాంటి పనులను అస్సలు ఒప్పుకోలేమని మృణాళ్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పష్టం చేశారు. తన రూపాన్ని వాడుతూ డీప్‌ఫేక్ వీడియోలు చేయడం లేదా వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. వెంటనే ఈ పనులను ఆపేయాలని, దీన్ని ఒక వార్నింగ్‌గా తీసుకోవాలని ఆమె సూచించారు.



ఇకపైనా తన పేరును, రూపాన్ని తప్పుగా వాడితే కచ్చితంగా లీగల్ యాక్షన్ తీసుకుంటానని చాలా ఘాటుగా హెచ్చరించారు. మృణాల్‌తో పాటు గతంలో రష్మిక మందన్న నకిలీ వీడియో వైరల్ అయినప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద వివాదం నడిచింది. ఆ తర్వాత అక్షయ్ కుమార్, వరుణ్ ధావన్, అనిల్ కపూర్, శిల్పా శెట్టి, కార్తీక్ ఆర్యన్, నాగచైతన్య, చిరంజీవి, శృతిహాసన్ వంటి చాలామంది స్టార్లు తమ ముఖాన్ని, వాయిస్‌ను అనుమతి లేకుండా వాడకుండా ఉండేందుకు కోర్టులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇక మృణాళ్ సినిమాల విషయానికి వస్తే.. ఇటీవల 'డెకాయిట్', 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' చిత్రాలతో అలరించిన ఆమె, ప్రస్తుతం డైరెక్టర్ అట్లీ తీస్తున్న భారీ సినిమా 'రాకా'లో నటిస్తున్నట్లు టాక్. అల్లు అర్జున్, దీపికా పదుకోన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని ఏకంగా రూ.1000 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## ఆర్సీ17 నుండి డీఎస్పీ ఔట్?

టాలీవుడ్ అగ్ర దర్శకుడు సుకుమార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో ఎలాంటి ఫెయిల్యూర్ లేకుండా ప్రతి సినిమా హిట్ అందుకుంటూ దూసుకు వెళ్తున్న వారిలో దర్శకుడు సుకుమార్ ఒకరు. ఇప్పటికే పుష్ప ఇలాంటి పెద్ద సినిమా చేసి... టాలీవుడ్ ఇండస్ట్రీని ఓ రేంజ్ కు తీసుకువెళ్లారు. అలాంటి సుకుమార్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నప్పుడు టాక్ నడుస్తోంది. దేవి శ్రీ ప్రసాద్ లేకుండానే తన తర్వాతి సినిమా చేసేందుకు డిసైడ్ అయ్యారట.



ఆర్య సినిమా నుంచి మొదలుకొని పుష్ప 2 వరకు సుకుమార్ చేసిన ప్రతి సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీత స్వరాలు అందించారు. అయితే త్వరలో రామ్ చరణ్ తో కొత్త సినిమా చేయనున్నారు సుక్కు. ఈ మూవీకి మాత్రం దేవి శ్రీ ప్రసాద్ ను పక్కన పెట్టారట. అతని స్థానంలో ధురంధర్ ఫ్రేమ్ శాశ్వత్ సచ్‌దేవ్ పేరు పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

కాగా ఎల్లమ్మ సినిమాతో దేవి శ్రీ ప్రసాద్ హీరోగా ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ నేపథ్యంలోనే సుకుమార్ తన తర్వాతి సినిమాకు డీఎస్పీని తీసుకోవడం లేదని కూడా ప్రచారం సాగుతోంది. కాగా ఆర్సీ 17 అనే వర్కింగ్ టైటిల్ తో సుకుమార్-రామ్ చరణ్ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలు సెప్టెంబర్ మాసంలో జరిగే అవకాశాలు ఉన్నాయి. దసరా పూర్తయిన తర్వాత షూటింగ్ ప్రారంభం కానుందని అంటున్నారు.